సాక్షి సంగారెడ్డి

శనివారం । 23 । నవంబర్ । 2024





సత్తాచాటిన కానిస్టేబుల్

దుబ్బాకలో దివ్య పోలీస్ ట్రైనింగ్ శిక్షణలో రాష్ట్ర స్థాయిలో బెస్ట్ ఆల్‌రౌండ్ పెర్‌ఫార్మెన్స్ అవార్డును అందుకున్నారు. వివరాలు 8లో ▸



అ'పూర్వ'ం.. అద్భుతం

పూర్వ విద్యార్థులంతా ఏకమైతామంటున్న గ్రామానికి, చదివిన పాఠశాలకు చేతనైన సాయం చేయాలనుకున్నారు. వివరాలు 9లో ▸

వాహ్వా.. మగువా..!

పాలనలోనూ 'రాణి'స్తున్న మహిళాధికారులు

- జిల్లాలో కీలక పదవుల్లో వారే
- ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేసేలా...
- సమస్యలను పరిష్కరిస్తూ.. ప్రజాక్షేత్రం వైపు అడుగులు
- అందరితో సమానంగా 'ఆమె' విధులు

నింగిలోనూ సగం..నేలపైనా సగం అంటుంటారు మహిళల్ని. నింగిలో విమానాలు నడపడటంతోపాటు అంతరిక్షానికి సైతం చేరుకుని విజయబావుటాలను ఎగురవేస్తున్న నేటి మహిళలు నేలపై కూడా తామేమీ మగవారికి తక్కువకాదని నిరూపిస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, ప్రభుత్వ ఆశయాలు నెరవేర్చడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. కీలక శాఖల్లో పాలనాధికారులుగా ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా ఉంటూ ప్రభుత్వ లక్ష్యాలను నెరవేరుస్తూ అటు ఉన్నతాధికారులు ఇటు ప్రజల మన్ననలు పొందుతున్నారు. మహిళా సాధికారతకు ఈ మహిళాధికారులు చిరునామాగా నిలుస్తున్నారు.

– సంగారెడ్డి జోన్

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ, ఉన్నత స్థానాలలో ఉన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో అందరితో సమానంగా సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఎక్కువగా మహిళా ఉపాధ్యాయులు ఉంటారు. రాత్రుల సమయాల్లో వెళ్లి ఎన్నికల నిర్వహణలో వారి పనితీరు అభినందనీయం. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని, ఉన్నత స్థానాల్లో ఉండాలి.

–వల్లూరు క్రాంతి, కలెక్టరు

నిరుత్సాహ పడకుండా కృషి చేయాలి



బాలికలు బాగా చదువుకోవాలి. అన్ని రంగాల్లో ఆసక్తి కలిగి ఉండి, రాణించాలి. ప్రస్తుత తరుణంలో మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నప్పటికి కొంతమంది మేము రాణించగలుగుతామా లేదా అని సందేహంలోని వారి భవిష్యత్తుకు బాటలు వేసుకోలేకపోతున్నారు. ప్రతీ మహిళ దృఢంగా ఉండటం నేర్చుకోవాలి. ఓటమి చెందినా నిరుత్సాహ పడకుండా గెలుపు కోసం కష్టపడాలి.

–ఆర్.డీ.మాధూరి, అడిషనల్ కలెక్టరు

ప్రోత్సాహంతోనే రాణించగలుగుతారు



బాలికలు ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేయాలి. విద్యార్థి దశలో చదువుకునే సమయంలో తల్లిదండ్రులు, ఉద్యోగులు చేసే సమయంలో భర్తతోపాటు కుటుంబ సభ్యులు మహిళలను ప్రోత్సహించాలి. అప్పుడే పూర్తిస్థాయిలో మహిళలు రాణించగలుగుతారు. చిన్నారులకు దత్తత ఇచ్చే సమయంలో మంచి కుటుంబానికి ఇచ్చినప్పుడే చిన్నారులతో పాటు మాకు కూడా సంతోషం కలుగుతుంది.

–లలిత కుమారి, జిల్లా సంక్షేమ అధికారి

కీలక శాఖల్లో వారే..

జిల్లా అభివృద్ధి కీలక శాఖల్లో మహిళలే కీలకంగా ఉండి పాలనలో పరుగులు పెట్టిస్తూ తమదైన శైలిలో ముద్ర వేస్తున్నారు. జిల్లా కలెక్టర్‌గా వల్లూరు క్రాంతి, జిల్లా జడ్జిగా భవాని చంద్ర, అడిషనల్ కలెక్టర్‌గా ఆర్డీ మాధురి, డి ఆర్‌వోగా పద్మజరాణి, గ్రామీణాభివృద్ధి, డీఆర్డీఏ అధికారిగా జ్యోతి, జిల్లా శిశు సంరక్షణ శాఖ అధికారిగా లలిత కుమారి, జిల్లా వైద్యాధికారిగా డాక్టర్ గాయత్రీ దేవి, పశుసంవర్ధక శాఖ అధికారిగా వసంత కుమారి, మెప్మా పీడీ గీత, మార్క్ ఫెడ్ డీఎంగా శ్రీదేవితోపాటు పలువురు మహిళలు కీలక శాఖల్లో అధికారులుగా ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులు, రెవెన్యూ, పోలీసు, మండల పరిషత్తుతోపాటు వివిధ శాఖలో సుమారు 3వేలకు పైగా విధులు నిర్వహిస్తున్నారు.

అన్ని రంగాలలో రాణించాలి



మహిళలు అన్ని రంగాలలో రాణించాలి. ఉద్యోగం ఏదైనా ఆత్మవిశ్వాసంతో విధులు నిర్వహిస్తూ ముందుకు సాగాలి. ఏ రంగంలోనైనా రాణించాలంటే విషయ పరిజ్ఞానం కలిగి ఉండాలి. అవగాహన లేకుండా ఏ రంగంలోనూ రాణించటం వీలుకాదు. దివ్యాంగులకు పెన్షన్ కల్పించిన సమయంలో, ఉపాధి లేని వారికి ఉపాధి కల్పించిన సమయంలో విధినిర్వహణలో సంతృప్తి కలుగుతుంది.

– జ్యోతి డి.ఆర్.డి.ఏ

ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేస్తూ..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే సంక్షేమ కార్యక్రమాలు క్షేత్ర స్థాయిలో ప్రజలకు చేరవేసేలా కృషి చేసేది అధికారులే. పాలనలో ప్రజలకు ప్రభుత్వాలకు వారధిగా మారి కీలకపాత్ర పోషిస్తున్నారు. జిల్లా అధికారులుగా ఉంటూ ప్రతీ ఒక్కరికి సంక్షేమం, సమన్యాయం అందేలా పర్యవేక్షిస్తూ స్వతహాగా నిర్ణయాలు తీసుకుంటూ పాలనలో తమదైన శైలిలో ముద్ర వేస్తున్నారు. ఎన్నికల సమయంలో రేయీ పగలు తేడా లేకుండా ఎన్నికల నిర్వహణలో మహిళల పాత్ర అభినందనీయంగా అధికారులు ప్రశంసిస్తున్నారు.

పాలనలో వెలుగులీనుతూ...

పరిపాలనలో పరుగులు పెట్టిస్తూ తనదైన ముద్ర వేస్తున్నారు జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి. సివిల్స్‌లో 65వ ర్యాంకు సాధించి, 2016 బ్యాచ్ తెలంగాణ క్యాడర్‌కు ఎంపికయ్యారు. నిర్మల్‌లో ట్రైనీ కలెక్టర్‌గా, మహబూబ్‌నగర్ జిల్లా ప్రత్యేక అధికారిగా, కరీంనగ ర్ మున్సిపల్ కమిషనర్‌గా, జోగుళాంబ కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. పట్టాపాస్ పుస్తకాలు రాకుండా ఇబ్బందులు పడుతున్న నిరుపేద రైతులపై దృష్టిపెట్టి వారి సమస్యల్ని పరిష్కరిస్తున్నారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాల్ని చేపడుతున్నారు.

తొలి ర్యాంకు సాధించి...

ఆర్.డీ మాధురి 2016లో జరిగిన గ్రూప్ వన్‌లో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించి, ఎంపికయ్యారు. రంగారెడ్డి జిల్లాలో డిప్యూటీ ట్రైనింగ్ కలెక్టర్‌గా, జగిత్యాల ఆర్డీవోగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా కొనసాగుతున్నారు.

సీడీపీవోగా ఉద్యోగ ప్రస్థానం...

లలిత కుమారి 2008లో నల్లగొండ జిల్లాలోని దేవరకొండలో సీడీపీవోగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించారు. వివిధ జిల్లాల్లో విధులు నిర్వహించి పదోన్నతిపై జిల్లా సంక్షేమాధికారిగా కొనసాగుతున్నారు.

ఎంపీడీవోగా ప్రారంభించి...

డీఆర్డీఏ పీడీగా విధులు నిర్వహిస్తున్న జ్యోతి 1996లో మహబూబ్‌నగర్ జిల్లాలోని మాడ్గుల్‌లో ఎంపీడీవోగా తన ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించారు. వివిధ స్థాయిలలో విధులు నిర్వహించి, పదోన్నతిపై ప్రస్తుతం డీఆర్డీఏ పీడీగా కొనసాగుతున్నారు.

వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా చేరి...

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిగా ఉన్న వసంతకుమారి 1994లో రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల డివిజన్‌లో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా విధుల్లో చేరారు. పదోన్నతులు పొంది ప్రస్తుతం జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిగా కొనసాగుతున్నారు.

శిక్షణాధికారిగా చేరి...

ఆర్టీసీలో 1998లో ట్రైనింగ్ ఆఫీసర్‌గా ఉద్యోగంలో చేరారు. పదోన్నతులతో 2023నుంచి మెదక్ జిల్లా ఆర్ఎంగా ప్రభులత బాధ్యతలు కొనసాగిస్తున్నారు.

న్యూస్‌రీల్

శ్రీనివాసమూర్తిపంతులుకు గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న కె.శ్రీనివాసమూర్తి పంతులు

సదాశివపేట(సంగారెడ్డి): జ్యోతిష్య వాస్తు శాస్త్రాలపై చేస్తున్న పరిశోధన, విశేష సేవా కార్యక్రమాలు చేపడుతున్నందుకుగాను పురోహితుడు కె.శ్రీనివాసమూర్తి పంతులుకు ఢిల్లీలోని ప్రపంచ సంస్కృతి, పర్యావరణ పరిరక్షన కమిషన్ గౌరవ డాక్టరేట్‌ను అందజేసింది. ప్రధానమంత్రి సంగ్రహాలయంలోని నెహ్రూ ఆడిటోరియంలో ఈ నెల 20న జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో శ్రీనివాసమూర్తి పంతులుకు పట్టాను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బాలీవుడ్ నటుడు విందు ధారాసింగ్, మాజీ టిబెటన్ పార్లమెంట్ డిప్యూటీ స్పీకర్ ఆచార్య ఏషీ పుష్టాక్, సుప్రీం కోర్టు బార్ కౌన్సిల్ మాజీ సెక్రటరీ జనరల్ రోహిత్ పాండే తదితరులు హాజరయ్యారు.

'మందులు అందుబాటులో ఉంచాలి'



మాట్లాడుతున్న గాయత్రీ దేవి.

సంగారెడ్డి టౌన్: రోగులకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వో గాయత్రీదేవి అన్నారు. సంగారెడ్డి మండలంలోని చింతల్‌బస్తీ, మార్చినగర్‌లో శుక్రవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్‌ను తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులకు మందుల పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. మందులను భద్రపరిచేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో స్వప్న

హత్నూర(సంగారెడ్డి): గ్రామాలలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో స్వప్న గ్రామపంచాయతీ కార్యదర్శులకు సూచించారు. హత్నూర మండలం లక్మాతాండాలో ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం వాటర్ ట్యాంక్‌తోపాటు గ్రామంలో మురికి కాల్వలను శుక్రవారం డిప్యూ టీ సీఈవో స్వప్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...గ్రామాలలో పారిశుద్ధ్యంపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. అంగన్‌వాడీలో బాలింతలకు, గర్భిణి లకు పిల్లలకు పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా అందించాలన్నారు. అంతకుముందు హత్నూర మండల పరిషత్ కార్యాలయంలో కుటుంబ సమగ్ర సర్వే వివరాల ఎంట్రీని జిల్లా పరిషత్ స్వప్న పరిశీలించారు.

ఏం చర్యలు తీసుకుంటారు

- అదానీ వ్యవహారంపై సీఎం రేవంత్‌కు ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్న
- రాహుల్‌గాంధీ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మండిపాటు



మాట్లాడుతున్న ఎంపీ.రఘునందన్‌రావు

జహీరాబాద్ టౌన్: అదానీ విషయంలో కాంగ్రెస్ అధినాయకుడు రాహుల్‌గాంధీ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఎంపీ రఘునందన్‌రావు విమర్శించారు. అదానీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఒప్పందాలు చేసుకున్నారని మరి రేవంత్‌పై రాహుల్ గాంధీ ఎటువంటి చర్యలు తీసుకుంటారని ఆయన ప్రశ్నించారు. జహీరాబాద్‌లో శుక్రవారం జరిగిన అయ్యప్పస్వామి మహా పడిపూజ కార్యక్రమంలో ఎంపీ రఘునందన్‌రావు పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాహుల్ గాంధీ ప్రధాని మోదీపై విమర్శలు చేయడం సరికాదన్నారు. అమెరికాలో అదానీపై వచ్చిన ఆరోపణలు పరిశీలిస్తే నాలుగు రాష్ట్రాల్లో అవినీతి జరిగిందని తెలుస్తోందని అందులో రెండు రాష్ట్రాలు కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాలేనన్నారు. మిగిలిన రెండు రాష్ట్రాలు కాంగ్రెస్ మిత్రపక్షం అధికారంలో ఉందనే విషయం మరిచి రాహుల్ తమ పార్టీపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

ఈ సమావేశాల్లోనే వక్ఫ్‌బోర్డు బిల్లు

ఈ పార్లమెంట్ సమావేశాల్లో వక్ఫ్ బోర్డు బిల్లు రాబోతుందని ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. దేశంలోని అందరి హక్కులను కాపాడేందుకు కేంద్రం కృషి చేస్తుందన్నారు. తీసుకురానున్న వక్ఫ్ బిల్లు చట్టం ద్వారా అన్ని వర్గాల భూముల పర్యవేక్షణ కలెక్టర్‌కు ఉంటుందన్నారు. ఎంపీ రఘునందన్ రావు వెంట మాజీ ఎంపీ బీబీపాటిల్, జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, నాయకులు జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



'కాటా'కు 'కొండ'ంత భరోసా..!

పటాన్‌చెరు: మంత్రి కొండా సురేఖతో కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గం ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం సాయంత్రం భేటీ అయ్యారు. నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిణామాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిసింది. కాటా, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మధ్య ఆధిపత్య పోరు జరుగుతుందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో మంత్రిని కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. కాటాకు మంత్రి 'కొండంత'భరోసా ఇచ్చినట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు.

ప్రసూతిసేవల్లోనూ ఖేడ్ ఆస్పత్రి భేష్

డీసీహెచ్ఎస్ డాక్టర్ సంగారెడ్డి

నారాయణఖేడ్: నారాయణఖేడ్ ప్రభుత్వాస్పత్రిలో గణనీయంగా ప్రసవాల సంఖ్య పెరిగిందని జిల్లా ప్రాంతీయ ఆస్పత్రుల సమన్వయకర్త (డీసీహెచ్ఎస్) డాక్టర్ సంగారెడ్డి పేర్కొన్నారు. నారాయణఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రిని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. వైద్యుల హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీసీహెచ్ఎస్ మాట్లాడుతూ...మూడు నెలల క్రితం వరకు 60లోపే ప్రసవాలు జరగగా ఇటీవలి కాలంలో 80 నుంచి 90వరకు ప్రసవాలు జరిగాయన్నారు. ఈ నెలలో ఇప్పటివరకే 70 ప్రసవాలు జరగాయని, నెలాఖరు వరకు ప్రసవాల సంఖ్య వందకు చేరుకుంటుందని అంచనా వేశారు. ప్రసవాలతోపాటు మిగతా సేవలు మెరుగు పడ్డాయని అన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేశ్‌ను అభినందించారు.

ప్రతీ పల్లెకు రాజ్యాంగాన్ని తీసుకువెళ్తా

తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజా గాయకులు గద్దర్ అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి పల్లెకు రాజ్యాంగాన్ని అందించేందుకు కృషి చేస్తానని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి తెల్లాపూర్‌లోని గద్దర్ విగ్రహం వద్ద కౌన్సిలర్ ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వెన్నెల మాట్లాడుతూ...తను సాంస్కృతిక సారథి బాధ్యతలను చూస్తూనే తన తండ్రి అడుగుజాడల్లో నడుస్తానని తెలిపారు.

పెట్రోల్ పోసి.. నిప్పంటించి..

- ఇంట్లో చొరబడి యువతిపై హత్యాయత్నం
- సిర్గాపూర్ మండలం వాసర్‌లో ఘటన

కల్హేర్(నారాయణఖేడ్): యువతిపై పెట్రోల్ పోసి గుర్తు తెలియని అగంతకుడు దాడికి పాల్పడ్డాడు. బైక్‌పై వచ్చి ఇంట్లోకి ప్రవేశించి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలు చావు బతుకుల మధ్య ఉంది. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం సిర్గాపూర్ మండలం వాసర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. వాసర్ గ్రామానికి చెందిన స్నేహలత(19) ఇంటర్ చదివి ఇంటి వద్దే ఉంటోంది. కాగా తల్లిదండ్రులు వ్యవసాయ కూలీ పనులకు వెళ్లిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ముఖానికి ముసుగు ధరించి బైక్‌పై వచ్చాడు. ఇంట్లో చొరబడి ముఖంపై పెట్రోల్ పోశాడు. నిప్పంటించి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలు ఇంట్లో ఉండగానే బయటి నుంచి తలుపు గడియ పెట్టి పారిపోయాడు. బాధితురాలు కేకలు వేయడంతో చుట్టుపక్కవారు వచ్చి తలుపులు తీశారు. అప్పటికే ముఖం కాలిపోయి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం పొరుగువారు తల్లిదండ్రులకు తెలపగా వారు చికిత్స నిమిత్తం నారాయణఖేడ్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు సంగారెడ్డి ఆసుపత్రికి రిఫర్ చేశారు. సంఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. యువతిపై పెట్రోల్‌తో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడడంతో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదు

కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి జోన్: ఎస్ఎస్ఆర్-2025 ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా రెండోసారి ఈ నెల 23, 24 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ క్రాంతి వల్లూరు శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో ఆయా పోలింగ్ కేంద్రాల బూత్‌స్థాయి ఎన్నికల సిబ్బంది ఓటరు నమోదు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. 1 జనవరి 2025 నాటికి 18 ఏళ్లు నిండే యువత ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ఓటరు నమోదు (ఫారం 6)తో పాటు తప్పుల సవరణ, అడ్రస్ మార్పు (ఫారం 8), చనిపోయిన వారి పేర్లు జాబితా నుంచి తొలగింపు కోసం ఫారం 7 సైతం ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమంలో స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

విధులను సక్రమంగా నిర్వర్తించాలి

- జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్
- నియామక పత్రాలు అందించిన ఎస్పీ



నియామకపత్రం అందిస్తున్న జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్

సంగారెడ్డి జోన్: తొమ్మిది నెలల ప్రాథమిక శిక్షణను పూర్తి చేసుకుని పూర్తి స్థాయి కానిస్టేబుల్స్‌గా పోలీసు శాఖలో అడుగుపెట్టిన వారినుద్దేశించి విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ అంకితభావంతో పని చేయాలని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ పిలుపునిచ్చారు. జిల్లాలో రిపోర్ట్ చేసిన మొత్తం 477 మంది కానిస్టేబుళ్లకు పోలీసు కుటుంబంలోనికి ఆహ్వానం పలుకుతూ శుక్రవారం వారికి ఎస్పీ రమేశ్ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...పోలీసు స్టేషన్‌కు వచ్చిన వారితో మర్యాదగా మాట్లాడాలన్నారు. క్రమశిక్షణకు మారుపేరైన పోలీసు శాఖలో పూర్తి నిబద్ధతతో విధులు నిర్వహించి, జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కోవచ్చని, ఈ ఫిట్నెస్‌ను ఎప్పుడూ కాపాడుకోవాలని చెప్పారు. నూతన చట్టాల గురించి నిరంతరం అధ్యయనం చేస్తూ అన్ని చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వివరించారు. సిబ్బంది అందరు తమకు కేటాయించిన హెడ్ క్వార్టర్‌లో అందుబాటులో ఉండాలని, అనవసర ప్రయాణాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధి కారి కల్యాణి, ఆఫీసు సూపరిండెంట్స్ అశోక్, వెంకటేశం, మినిస్టీరియల్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా పత్తి కొనుగోళ్లు

- జిల్లాలో 22 సీసీఐ కేంద్రాల ఏర్పాటు
- పది రోజుల్లో 98,487 క్వింటాళ్ల కొనుగోలు
- మద్దతు ధర రూ.7,521 చెల్లింపు



రాయికోడ్ సీసీఐ కేంద్రంలో కొనుగోలు చేసిన పత్తి

రాయికోడ్(అందోల్): పత్తి కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. దళారుల బారిన పడి రైతులు మోసపోకుండా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి సేకరిస్తున్నారు. జిల్లాలోని రాయికోడ్, మునిపల్లి, నారాయణఖేడ్, సదాశివపేట, వట్‌పల్లి, జోగిపేట తదితర మండలాల్లోని జిన్నింగ్ మిల్లుల్లో 22 సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 7,521 నిర్ణయించారు. అయితే 8 శాతం వరకు తేమ ఉన్న పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నారు. 8కి మించితే ధరలో కోత విధిస్తున్నారు. వానాకాలం సీజన్‌లో భాగంగా జిల్లాలో రైతులు 3.60 లక్షల ఎకరాల్లో పత్తిని సాగు చేశారు. జిల్లాలోని వివిధ మండలాల్లో పది రోజుల క్రితం సీసీఐ కేంద్రాలను ప్రారంభించారు. 22 కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 98,487 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. వచ్చే ఏడాది జనవరి నెలాఖరు వరకు కేంద్రాల్లో పత్తి కొనుగోలు చేయనున్నారు. రైతుల వద్ద అప్పటికీ ఇంకా పత్తి నిల్వ ఉంటే మరికొన్ని రోజులు కేంద్రాలను పెంచనున్నట్లు అధికారులు తెలిపారు.

మద్దతు ధర దక్కింది



సీసీఐ కేంద్రంలో పత్తిని విక్రయంచాను. క్వింటాల్ పత్తికి ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ. 7,521 లభించింది. చేను నుంచి తీసుకువచ్చిన పత్తిని నిల్వ చేసే క్రమంలో తేమ శాతం ఎక్కువగా ఉండకుండా జాగ్రత్తలు తీసుకున్నా. అధిక వర్షాలతో పంట దెబ్బతినడం వల్ల ఎకరాకు 8 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది.

– విజయ్‌కుమార్, రైతు లింగంపల్లి

సీసీఐ కేంద్రాల్లోనే విక్రయించాలి



రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తిని విక్రయించి మద్దతు ధర పొందాలి. తేమ శాతం ఎక్కువ రాకుండా పత్తిని లూస్‌గా వాహనాల్లో సీసీఐ కేంద్రాలకు తరలించాలి. దళారులకు పత్తిని విక్రయించి మోసపోవద్దు. రైతులు పండించిన పంట పూర్తిస్థాయిలో కొనుగోలు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేస్తాం.

– రియాజ్, డీఎంఓ సంగారెడ్డి

సర్వే వివరాలు పక్కాగా నమోదు చేయాలి

జెడ్పీ సీఈవో జానకి రెడ్డి

ఝరాసంగం(జహీరాబాద్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబ సమగ్ర సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో పక్కాగా నమోదు చేయాలని జెడ్పీ సీఈవో జానకిరెడ్డి ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రమైన ఝరాసంగంలో ప్రారంభమైన ఆన్‌లైన్ డేటా ఎంట్రీ విధానాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు నమోదు ప్రక్రియను పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన రైతన్న

అల్లాదుర్గం(మెదక్): ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై రైతు లు ఆగ్రహించారు. శుక్రవారం రాంపూర్ శివారులోని 161 జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున రాస్తారోకో చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓ కేంద్రంలో తూకంలో మోసం, మరో కేంద్రంలో కొనుగోలుకు నిబంధనలు పెడుతూ వేధిస్తున్నారని వాపోయారు. ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులే మిల్లుకు తేవాలని ఐకేపీ అధికారులు చెబుతున్నారని మండిపడ్డారు. అదనంగా రెండు కేజీలు తూకం వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యంలో నూకలు ఎక్కువగా వస్తున్నాయని మిల్లర్లు తీసుకునేందుకు నిరాకరించారని చెప్పారు. ఇతర మిల్లులకు పంపాలంటే ట్రాన్స్‌పోర్టు చార్జీలు రైతులే భరించాలని కొనుగోలు కేంద్రం సిబ్బంది చెబుతున్నారని అన్నారు.

క్లుప్తంగా

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యం

పటాన్‌చెరుటౌన్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యమైన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బీరంగూడ పరిధిలోని సృజన లక్ష్మీనగర్ కాలనీకి చెందిన శ్రీనివాసరావు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అక్టోబర్ 7వ తేదీన ఇంటి నుంచి ద్విచక్ర వాహనం పై ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు స్థానికంగా, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. అప్పుల బాధతో ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు శుక్రవారం శ్రీనివాస్ బావ గోవిందరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అనారోగ్యంతో తల్లి.. రోడ్డు ప్రమాదంలో తండ్రి

ఆరు నెలల వ్యవధిలో ఇద్దరిని కోల్పోయిన కుమారులు

వర్గల్(గజ్వేల్): ఆరు నెలల కిందట తల్లిని అనారోగ్యం చనిపోయింది. గురువారం రాత్రి వర్గల్ మండలం అనంతగిరిపల్లి క్రాస్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెందాడు. ఆరు నెలల వ్యవధిలో తల్లిదండ్రుల మృతితో వారి ఇద్దరు కుమారులు దిక్కులేని వారు అయ్యారు. మృతుడి సోదరుడు, గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. ఉమ్మడి మెదక్ జిల్లా గుమ్మడిదల మండలం మాంబాపూర్ గ్రామానికి చెందిన కొత్తపేట మల్లేశ్(41) కూలీ పని చేస్తుంటాడు. అతడి భార్య నర్సమ్మ ఆరు నెలల కిందట అనారోగ్యంతో మృతి చెందింది. వీరి ఇద్దరు కుమారుడు అఖిల్(ఇంటర్ ద్వితీయ), అనీల్ (ఇంటర్ ప్రథమ) చదువుతున్నారు. బుధవారం ఉదయం వర్గల్ మండలం వేలూరు గ్రామంలో పని ఉందని తల్లి పొన్నమ్మకు చెప్పి మల్లేశ్ బైక్ మీద బయల్దేరాడు. అదేరోజు రాత్రి వేలూరు సమీప అనంతగిరిపల్లి చౌరస్తా వద్ద మల్లేశ్ బైక్‌ను గజ్వేల్ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. చికిత్సనిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

పెళ్లి చేసుకుంటానని మోసం

యువకుడిపై కేసు నమోదు

కల్హేర్(నారాయణఖేడ్): పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన యువకుడిపై కేసు నమోదు చేశామని కల్హేర్ ఎస్‌ఐ వెంకటేశం శుక్రవారం తెలిపారు. మండలంలోని ఫతేపూర్‌కు చెందిన యువతి(24)ని నారాయణఖేడ్ మండలం పంచగామకు చెందిన భీమేష్ యాదవ్ ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఇటీవల యువతితో దూరంగా ఉంటూ పెళ్లికి నిరాకరించాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. భీమేష్ యాదవ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వెంకటేశం తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడిని చూపుతున్న సీఐ

మనోహరాబాద్(తూప్రాన్): హత్య కేసులో ఓ నిందితుడి శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తూప్రాన్ సీఐ రంగాకృష్ణ కథనం మేరకు.. పంజాబ్‌కు చెందిన ప్రమోద్ పాశ్వాన్ మేస్త్రీతో పాటు బిహార్‌కు చెందిన బిట్టుకుమార్, అతడి భార్య కలిసి ఒకే దగ్గర ఉంటూ పని చేసేవాళ్లు. ప్రమోద్‌పాశ్వాన్, బిట్టుకుమార్ భార్యతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ఇబ్బందులకు గురి చేసేవాడు. ఈ విషయంలో బిట్టుకుమార్ ఆవేశంతో 16న ప్రమోద్ పాశ్వాన్‌ను కట్టెతో కొట్టి చంపి పరారయ్యాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్, ఐడీ పార్టీ సిబ్బంది గోవర్ధన్, శ్రీనివాస్‌రాథోడ్, కృష్ణ, పోలీసులున్నారు.

వృద్ధురాలి హత్య కేసులో..

సంగారెడ్డి టౌన్ : వృద్ధురాలి హత్య కేసులో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రూరల్ సీఐ క్రాంతికుమార్ కథనం మేరకు.. సంగారెడ్డి మండలంలో ఇరిగిపల్లి గ్రామంలో 19న బొబ్బిలి కమలమ్మ (60) అనే మహిళను పత్తి చేనులో హత్య చేసి బంగారాన్ని లాక్కెళ్లిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు అదే గ్రామానికి చెందిన నీరుడి చంద్రయ్య పై అనుమానంతో అదుపులోకి తీసుకొని విచారించారు. నేరం ఒప్పుకోవడంతో కోర్టులో హాజరుపర్చగా నిందితుడికి శిక్ష విధించినట్లు తెలిపారు.

దుబ్బాక.. ఎన్నాళ్లింక

నియోజకవర్గంలో మూడుముక్కలాటగా రాజకీయ పరిస్థితులు

- అధికారంలో కాంగ్రెస్ సర్కార్
- ఎమ్మెల్యే బీఆర్‌ఎస్, ఎంపీ బీజేపీ..
- భిన్న రాజకీయాలతో అంతా అయోమయం
- అసలే వెనుకబడ్డ మారుమూల నియోజకవర్గం
- ఏ కార్యక్రమం చేపట్టినా టెన్షన్ వాతావరణం
- అడ్రస్ లేని అభివృద్ధి పనులు
- అవస్థలు పడుతున్న ప్రజలు



దుబ్బాక పట్టణం వ్యూ

దుబ్బాక: దుబ్బాక నియోజకవర్గంలో ప్రస్తుత భిన్న రాజకీయాలతో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా తయారైంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండడం.. ఎమ్మెల్యేగా బీఆర్‌ఎస్ నుంచి కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తుండగా, ఎంపీగా బీజేపీ నుంచి మాధవనేని రఘునందన్‌రావు ఉండడంతో నియోజకవర్గంలో అంతా అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. మూడు పార్టీలు పోటాపోటీగా రాజకీయంగా కార్యక్రమాలు చేపడుతుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి.

సహకారం లేక.. నిధులు రాక

దుబ్బాక నియోజకవర్గంలో మూడు ముక్కలాట రాజకీయం నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా, ఎమ్మెల్యేగా బీఆర్‌ఎస్ నుంచి కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎంపీగా బీజేపీ నుంచి మాధవనేని రఘునందన్‌రావు గెలుపొందడంతో నియోజకవర్గంలో కొద్ది నెలలుగా ఆసక్తికర రాజకీయాలు నెలకొన్నాయి. కాంగ్రెస్ నుంచి గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందిన మాజీ మంత్రి చెరుకు ముత్యం రెడ్డి తనయుడు శ్రీనివాస్‌రెడ్డి నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఉంటూ ప్రభుత్వ కార్యక్రమాలతోపాటు కాంగ్రెస్ కేడర్‌ను బలోపేతం చేసుకుంటూ తనదైన శైలిలో దూసుకుపోతున్నారు. ఎంపీగా మూడు సార్లు పనిచేసి ఇప్పుడు మొదటిసారి ఎమ్మెల్యేగా బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందిన కొత్త ప్రభాకర్‌రెడ్డికి ప్రభుత్వం ఏ మాత్రం సహకరించక పోతుండడంతో అభివృద్ధి పనులకు నిధులు రాక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి అనారోగ్యంతో మృతిచెందడంతో జరిగిన దుబ్బాక ఉప ఎన్నికల్లో బీజేపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన మాధవనేని రఘునందన్‌రావు మళ్లీ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందడం, ఆ తర్వాత మెదక్ ఎంపీగా పోటీచేసి గెలుపొందిన విషయం తెలిసిందే. దీంతో మూడు పార్టీల మధ్య ఆధిపత్య పోరుతో దుబ్బాకలో సంచలన రాజకీయాలు నెలకొన్నాయి.

ఏ కార్యక్రమం జరిగినా టెన్షన్.. టెన్షన్

దుబ్బాక నియోజకవర్గంలో ప్రభుత్వ కార్యక్రమాలు చేపట్టాలంటే అధికారులకు తలనొప్పిగా తయారైంది. ఇటీవలె దుబ్బాకలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ రాగా స్టేజీపైకి కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి రావడంపై ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డితో పాటు బీఆర్‌ఎస్ శ్రేణులు గొడవకు దిగడంతో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. దీంతో మంత్రి మధ్యలోనే వెళ్లి పోయారు. ఆ కార్యక్రమంలోనే మొదటిసారి దుబ్బాకకు వచ్చిన మంత్రి సురేఖకు ఎంపీ రఘునందన్‌రావు దుబ్బాక చేనేతలు తయారు చేసిన నూలుపోగుల దండతో సత్కరించిన ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర వివాదం జరిగిన విషయం తెలిసిందే. ఇలా దుబ్బాకలో ఏ కార్యక్రమం జరిగిన వందలాది మంది పోలీసు బలగాల మధ్యన తీవ్ర ఉద్రిక్తత పరిస్థితుల మధ్య జరపాల్సి వస్తుండడంతో పోలీసు అధికారులకు సైతం తలనొప్పిగా తయారైంది.

అభివృద్ధికి ఆమడ దూరంలో..

అసలే వెనుకబడ్డ మారుమూల దుబ్బాక నియోజకవర్గంలో నెలకొన్న రాజకీయాలతో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండిపోయింది. ప్రధాన సమస్యలు దుబ్బాక రెవెన్యూ డివిజన్‌తోపాటు మున్సిపాల్టీ అభివృద్ధికి మంజూరైన రూ.20 కోట్లు పెండింగ్‌లోనే ఉండడం, మల్లన్నసాగర్ కాల్వల నిర్మాణంతోపాటు చాలా అభివృద్ధి పనులు జరుగకపోతుండడంతో ప్రజలు తీవ్ర నిరాశలో ఉన్నారు.

ప్రభుత్వం చిన్నచూపు



దుబ్బాక నియోజకవర్గంపై కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తుంది. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలపై ప్రభుత్వం కావాలనే కక్ష సాధింపు ధోరణి అవలంభిస్తుంది. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయకుండా కేవలం మంత్రుల నియోజకవర్గాలకే నిధులు కేటాయించడం ఎంత వరకు సమంజసం.

– కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే

ఎప్పుడూ అన్యాయమే..



దుబ్బాక నియోజకవర్గంకు గతంలో నుంచి అన్యాయమే జరుగుతుంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నిర్లక్ష్యం చేస్తుంది. దుబ్బాక నియోజకవర్గంపై ఏ ప్రభుత్వం వచ్చిన తీరని అన్యాయమే జరుగుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజల మనోభావాలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి పనులు చేయాలి.

– మాధవనేని రఘునందన్‌రావు, ఎంపీ

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి



కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధి జరిగింది. గతంలో మా తండ్రి చెరుకు ముత్యంరెడ్డి మంత్రిగా, ఎమ్మెల్యేగా ఉన్న హయాంలోనే నియోజకవర్గం అభివృద్ధిలో ఉమ్మడి రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచింది. నియోజకవర్గం అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుంది.

– చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి

బందోబస్తు మధ్య ఆలయ దర్శనం

గజ్వేల్ కాంగ్రెస్‌లో మరోసారి బయటపడ్డ గ్రూపు రాజకీయాలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): కొండపోచమ్మ ఆలయ వార్షికోత్సవాల సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయశాఖ కార్యదర్శి నలుగురి సభ్యులతో కూడిన పునర్జీవన కమిటీని గురువారం ప్రకటించిన విషయం తెలిసిందే. జగదేవ్‌పూర్ మండలానికి చెందిన కమిటీ సభ్యులు ఆగమల్లు, అశయ్య, వజ్రమ్మ, నరేశ్‌లతోపాటు రాష్ట్ర టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు, స్థానిక కాంగ్రెస్ నేతలు శుక్రవారం అమ్మవారి దర్శనానికి వస్తున్నారని సమాచారం ఉండగా, తిగుల్ నర్సాపూర్ గ్రామస్తులు, కాంగ్రెస్‌లో మరో వర్గానికి చెందిన నేతలు ఘర్షణ చేసే అవకాశం ఉందని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, జగదేవ్‌పూర్, మర్కూక్, గౌరారం ఎస్‌ఐలు చంద్రమోహన్, దామోదర్, కరుణకర్‌రెడ్డిలతోపాటు పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. పునర్జీవన కమిటీ సభ్యులు, టీపీసీసీ అధికారి శ్రీకాంత్‌రావు, కాంగ్రెస్ నేతలు ఆలయానికి చేరుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు కమిటీ సభ్యులకు శాలువాలు కప్పి సన్మానించారు. గజ్వేల్ కాంగ్రెస్‌లో నెలకొన్న గ్రూపు రాజకీయాల నేపథ్యంలో పోలీసుల బందోబస్తు మధ్య కమిటీ సభ్యులు అమ్మవారిని దర్శించుకోవడం చర్చనీయాంశంగా మారింది. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భానుప్రకాశ్ రావు, నాయిని యాదగిరి, గోపాల్, ప్రవీణ్ కుమార్, జానీ, రాజు, దాసు, స్వామి, రతన్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.



ఆలయం వద్ద పోలీసులు

ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి

సిద్దిపేటకమాన్: డిసెంబర్ 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక మొత్తంలో కేసులు రాజీ పడేటట్లు చూడాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకొని సిద్దిపేట కోర్టులో పోలీసు, ఎక్సైజ్, రెవెన్యూ శాఖల అధికారులు, న్యాయవాదులతో శుక్రవారం న్యాయమూర్తి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్, మోటారు వాహనాల కేసులలో రాజీ కుదిర్చి కేసులను రాజీ అయ్యేట్లు చూడాలన్నారు. సమావేశంలో న్యాయమూర్తులు స్వాతిరెడ్డి, మిలింద్ కాంబ్లి, శ్రావణియాదవ్, తరణి, కాంతరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, సెక్రటరీ మంతూరి సత్యనారాయణ, న్యాయవాదులు, అదనపు డీసీపీ మల్లారెడ్డి, ఏసీపీ మధు, సీఐలు వాసుదేవరావు, ఉపేందర్, విద్యాసాగర్, శ్రీను, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాయి రమాదేవి

యాసంగికి స్వల్పకాలిక రకాలే మేలు

కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ప్రతాప్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): యాసంగి వరిసాగులో స్వల్పకాలిక రకాలైన వరి పంటను సాగు చేయడం వల్ల రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ప్రతాప్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని తునికి గ్రామంలో రైతులకు (కృషి విజ్ఞాన కేంద్రం) కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయ విద్యార్థులు యాసంగి వరిసాగు, సస్యరక్షణ చర్యలు, నీటి యాజమాన్యం, ఎరువుల వాడకం, చీడపీడల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాసంగి వరి సాగులో త్వరగా కోతకు వచ్చే పంటలను సాగు చేయడం వల్ల వేసవిలో నీటి ఎద్దడిని అధిగమించవచ్చని తెలిపారు. సన్నరకం వరిలో తెలంగాణ సోన (ఆర్ఎన్ఆర్–15048), కూనారం వరి 2 (కేఎన్ఎం–1638), దొడ్డురకం వరిలో జగిత్యాల రైస్ 1(జేజీఎల్–24423), కూనారం సన్నలు (కేఎన్ఎం–118) వంటి రకాలు సాగు చేసినట్లయితే రైతులు అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. దీంతో పాటు వరి పంటకు సోకే కాండం తొలుచు పురుగు, అగ్గి తెగులు నివారణ, యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సౌజన్య, మల్లారెడ్డి యూనివర్సిటీ వ్యవసాయ కళాశాల విద్యార్థినిలు శ్రేష్ఠ, శ్రావిక, సింధు, సాయిప్రణతి, స్పందన గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన శాస్త్రవేత్తలు

స్కూల్ గేమ్స్‌కి హెడ్ ఆఫ్ ది డెలిగేషన్‌గా భరత్‌రెడ్డి

కోహెదరూరల్(హుస్నాబాద్): చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో దుర్గి జిల్లాలోని మహాసముద్‌లో జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ అండర్ 14 బాలబాలికల జట్టుకు హెడ్ ఆఫ్ ది డెలిగేషన్‌గా సిద్దిపేట జిల్లా కోహెద మండలంలోని తెలంగాణ ఫిజికల్ డైరెక్టర్ భరత్‌రెడ్డి వ్యవహరించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తెలంగాణ సెక్రటరీ రాంరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. 25 నుంచి 29 వరకు జాతీయస్థాయి పోటీలు జరుగనున్నాయి. జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ సౌందర్య, ప్రిన్సిపాల్ నర్సింహులు భరత్‌రెడ్డిని అభినందించారు.

అత్యాచారం కేసులో 20 ఏళ్లు జైలు, జరిమానా

న్యాల్‌కల్(జహీరాబాద్) : బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి కోర్టు జైలు శిక్షతోపాటు జరిమానా విధించినట్లు ఎస్పీ చెన్నూరి రూపేష్ ఓ ప్రకటనలో తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. న్యాల్‌కల్ మండల పరిధిలోని అమీరాబాద్ గ్రామానికి చెందిన మాలి పటేల్ వసంత్‌రావు 12 ఏళ్ల మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి బాలికను గర్భవతిని చేశాడు. ఈ విషయంపై బాధిత కుటుంబ సభ్యులు జూలై 7వ తేదీ 2018లో హద్నూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఏఎస్‌ఐ ఈశ్వర్ కేసు నమోదు చేశారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు వసంత్‌రావుకు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.25 వేలు జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్ పోక్సో న్యాయ మూర్తి జయంతి శుక్రవారం తీర్పును వెలువరించినట్లు ఎస్పీ పేర్కొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

మునిపల్లి(అందోల్): నీటిలో మునిగి వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ రాజేశ్ నాయక్ కథనం మేరకు.. నిర్మల్ జిల్లా గాంధీ నగర్ శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టుకు చెందిన నాస్కిన్ కాశీనాథ్ (30) 16 ఏళ్లుగా పుల్‌కల్ మండలం సింగూర్ గ్రామంలో ఉంటూ సింగూర్ ప్రాజెక్టులో చేపలు పడుతూ జీవనం సాగిస్తున్నారు. 19న ఎప్పటిలాగే సింగూర్ ప్రాజెక్టులో చేపలు పట్టడానికి వెళ్లి తిరిగి రాలేదు. మూడు రోజులుగా తెలిసిన వారి దగ్గర వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం సింగూర్ ప్రాజెక్టులో నాస్కిన్ కాశీనాథ్ శవమై తేలాడు. చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందినట్లు మృతుడి భార్య లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సత్తాచాటిన కానిస్టేబుల్

రాష్ట్రస్థాయిలో బెస్ట్ ఆల్‌రౌండ్‌గా అవార్డు అందుకున్న దివ్య

దుబ్బాక: దుబ్బాక పట్టణంలోని పేద చేనేత కుటుంబంలో పుట్టిన గజం దివ్య పోలీస్ ట్రైనింగ్ శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలో బెస్ట్ ఆల్‌రౌండ్ పెర్‌ఫార్మెన్స్ అవార్డును అందుకున్నారు. పట్టణంలోని గజం నరేశ్, లత దంపతుల కూతురు దివ్య ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికైంది. 9 నెలలుగా హైదరాబాద్‌లో పోలీస్ ట్రైనింగ్ పొందింది. ఈ సందర్భంగా జరిగిన పోలీస్ ట్రైనింగ్ ముగింపు కార్యక్రమంలో దివ్యకు రాష్ట్రస్థాయిలో 1,000 మార్కులకు 940 మార్కులు వచ్చాయి. ఈ సందర్భంగా బెస్ట్ ఆల్‌రౌండ్ పెర్‌ఫార్మెన్స్ అవార్డును అందుకుంది. దివ్యకు మెడల్, జ్ఞాపికను అందించి ఆమె తల్లిదండ్రులను ప్రత్యేకంగా పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.



తల్లిదండ్రులతో దివ్య

జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక

హుస్నాబాద్: జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల 7వ తరగతి విద్యార్థి గౌరవేని అశ్వంత్ ఎంపికయ్యాడు. 8 నుంచి 10వ తేదీ వరకు హుస్నాబాద్ మినీ స్టేడియంలో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలు నిర్వహించారు. మెదక్ ఉమ్మడి జిల్లా జట్టుకు ప్రాతినిత్యం వహించిన అశ్వంత్ అత్యంత ప్రతిభ కనబర్చాడు. 25 నుంచి 29వ తేదీ వరకు చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని మహాసముందులో జరుగనున్న అండర్ 14 హ్యాండ్ బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు పాఠశాల పీడీ శ్రీనివాస్ తెలిపారు.



అశ్వంత్

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు..

మిరుదొడ్డి(దుబ్బాక): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) రాష్ట్రస్థాయి అండర్ 17 నెట్‌బాల్ పోటీలకు అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థినీలు కే.అనన్య, ఎస్.చైతన్య ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నరేశ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ప్రజ్ఞాపూర్ ప్రభుత్వ పాఠశాల మైదానంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఎస్‌జీఎఫ్ నెట్‌బాల్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. 23 నుంచి మహబూబాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థినీలను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.



క్రీడాకారులు అనన్య, చైతన్య

అండర్ 8లో రాష్ట్రస్థాయికి..

హవేళిఘణాపూర్(మెదక్) : మెదక్ మండల పరిధిలోని మంభోజిపల్లి గీతా పాఠశాల విద్యార్థి శ్రీవర్ధన్ అండర్ 8 బాలుర విభాగంలో రాణించి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి తెలిపారు. శ్రీవర్ధన్ 300, 50 మీటర్ల పరుగుపందెం, ట్రిబుల్ జంప్ మూడు విభాగాల్లో ప్రతిభ కనబర్చి రాణించి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.



శ్రీవర్ధన్‌పటేల్

సీఎం కప్‌లో యోగాసన పోటీలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రంలో నిర్వహించనున్న సీఎం కప్‌లో యోగాసన పోటీలను చేర్చారని రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ టెక్నికల్ తోట సతీశ్ తెలిపారు. శుక్రవారం హైద్రాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో మేనేజింగ్ డైరెక్టర్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ సోని బాలాదేవిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌రావు, ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్, ఆర్గనైజింగ్ జాయింట్ సెక్రటరీ రాంరెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ రవీందర్, తదితరులు పాల్గొన్నారన్నారు.



సోని బాలాదేవితో అసోసియేషన్ నాయకులు

అమ్మవారి దర్శనానికి వచ్చి అనంత లోకాలకు


ఏడుపాయల్లో నీటిలో మునిగి యువకుడు మృతి

పాపన్నపేట(మెదక్): చెక్ డ్యాంలోకి దిగి నీటిలో మునిగి యువకుడు మృతి చెందిన ఘటన ఏడుపాయల్లో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం దేవునిపల్లి గ్రామానికి చెందిన చాకలి సాయిలు (35) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఓ విందు నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి ఏడుపాయలకు వచ్చాడు. దుర్గమ్మ దర్శనం అనంతరం సాయిలు స్నానం చేసేందుకు చెక్ డ్యాంలోకి దిగాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ఊపిరాడక మృతి చెందాడు. కుటుంబ సభ్యులు వెంటనే అప్రమత్తమై స్థానికుల సహాయంతో గాలించగా మృతదేహం లభ్యమైంది. ఈ ఘటనపై ఎస్సై శ్రీనివాస్ గౌడ్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

లారీ, బైక్ ఢీ ఇద్దరు మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

మెదక్ మున్సిపాలిటీ: ఎదురెదురుగా లారీ, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. సీఐ నాగరాజు కథనం మేరకు.. చిన్నశంకరంపేట మండలం శాలిపేటకు చెందిన వంశీ(22), సోదరుడు నవీన్, అక్క భాగ్య కలిసి పని నిమిత్తం మెదక్‌కు బైక్‌పై వస్తున్నారు. పట్టణ శివారులోని పిల్లికొట్టాల్ సమీపంలో మెదక్ వైపు నుంచి వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వంశీ అక్కడికక్కడే మృతి చెందగా నవీన్, భాగ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ నవీన్ మృతి చెందారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని మృతుడి బంధువులు ఆరోపించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



ప్రమాద స్థలంలో వంశీ

ఆటోను ఢీకొట్టిన డీసీఎం: ఐదుగురికి గాయాలు

సిద్దిపేటఅర్బన్: ఆటోను డీసీఎం వ్యాను ఢీకొట్టడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లికి చెందిన దామరబోయిన శ్రీనివాస్ శుక్రవారం తమ గ్రామానికి చెందిన వారిని కొండపోచమ్మ దేవాలయం వద్ద నుంచి ఆటోలో తీసుకొని సిద్దిపేటకు వస్తున్నాడు. పొన్నాల శివారులోకి రాగానే ఆటోను వెనుక నుంచి డీసీఎం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. వీరిలో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. ఇదే సమయంలో అటుగా వెళ్తున్న సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. డీసీఎంను ఆపకుండా డ్రైవర్ వెళ్లిపోయాడు. ఆటో డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అమ్మ నీకు భారమయ్యా.. క్షమించు

సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యకు పాల్పడిన దత్తత కుమారుడు

శివ్వంపేట(నర్సాపూర్): జులాయిగా తిరుగుతున్న కుమారుడిని తల్లి మందలించడంతో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండల పరిధి దంతన్‌పల్లి గ్రామానికి చెందిన కుల్ల లక్ష్మీ నర్సింలు దంపతులకు సంతానం కలగకపోవడంతో ఓ బాబుని దత్తత తీసుకున్నారు. కొన్నేళ్ల తర్వాత దంపతులకు కూతురు పుట్టింది. పిల్లలు చిన్నతనంలోనే నర్సింలు మృతి చెందాడు. అప్పటి నుంచి లక్ష్మీ కూలి పనులు చేసుకుంటూ దత్తత కుమారుడు వెంకటేశ్(24)తోపాటు కూతురు అఖిలను పోషిస్తుంది. కుమారుడు ఎలాంటి పనులు చేయకుండా జులాయిగా తిరుగుతుండటంతో తల్లి గురువారం మందలించింది. ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన అతడు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. శుక్రవారం ఉదయం గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకొని కనిపించాడు. అమ్మ నన్ను క్షమించు నీకు భారమయ్యాను. నా చావుకు కారణం ఎవరు కాదు. నీవు, చెల్లి ఆనందంగా ఉండండి అంటూ రాసిన సూసైడ్ నోట్ మృతుడి జేబులో లభ్యమైంది. మృతుడు తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.



వెంకటేష్ (ఫైల్)

ఉరేసుకొని వ్యక్తి..

సిద్దిపేటరూరల్: చెట్టుకు ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నారాయణరావుపేట మండల పరిధిలోని జక్కాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. చిన్నకోడూరు ఎస్‌ఐ బాలక్రిష్ణ కథనం మేరకు.. జక్కాపూర్ గ్రామానికి చెందిన కారంకంటి రాజు (32) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రాజుకు నాలుగేళ్లుగా మానసిక స్థితి సక్రమంగా లేదు. ఆస్పత్రుల్లో వైద్యం చేయించినప్పటికీ ఫలితం లేదు. శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్తున్నానని వెళ్లి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.